హైదరాబాద్ రవీంద్రభారతిలో 6TV రిపోర్టర్ కు ఘన సత్కారం

జనగామ, అక్టోబర్ 9 (డిడి9) వార్త

రవీంద్రభారతిలో జరిగిన పీపుల్ మీడియా పాయింట్ న్యూస్ ఛానల్ రెండో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పీపుల్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 6TV జనగామ జిల్లా రిపోర్టర్ తిప్పారపు ఉపేందర్‌కు పురస్కారం2026 అందజేశారు. జర్నలిజం రంగంలో విశేష సేవలందించినందుకు గాను నిర్వాహకులు ఉపేందర్‌ను శాలువాతో సత్కరించి అవార్డు ప్రదానం చేశారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా మాజీ మంత్రి బాబు మోహన్ హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తూ పుట్టినరోజు వేడుక మానవత్వం చాటిన మల్కాపూర్ యువకుడు

- 29వ సారి రక్తదానం చేసిన రంజిత్ రెడ్డి
- జనగామ, అక్టోబర్ 9(డిడి9) వార్త

జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన రంజిత్ రెడ్డి తన జన్మదినాన్ని వినూత్నంగా జరుపుకున్నారు. శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా హనుమకొండలోని రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదానం చేశారు. ఇది ఆయన చేస్తున్న 29వ సారి రక్తదానం కావడం విశేషం పుట్టినరోజు అంటే కేకులు, పార్టీలు కాదని, నలుగురికి ఉపయోగపడేలా ఉండాలని రంజిత్ రెడ్డి అన్నారు. యువత కూడా రక్తదానంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



జనగామనెహ్రూపార్క్ డీసీపీ ఆఫీస్ ఎదురుగా సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- సంప్రదాయ దుస్తుల్లో సందడి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

జనగామ అక్టోబర్9(డిడి9) వార్త

జనగామ పట్టణంలో నెహ్రూపార్క్ దగ్గర డీసీపీ ఆఫీస్ ఎదురుగా సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటుతూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పద్మశ్రీ దేవి, ప్రిన్సిపాల్ బాసాని శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుకలు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.







"బతుకమ్మ వైబ్స్ "లో మెరిసిన విద్యార్థులు!!

- పూల సింగిడితో పండుగ సందడి
- చప్పట్ల సవ్వడిలో బతుకమ్మ సంబరం
- విద్యార్థినిలతో కలిసి బతుకమ్మ ఆడిన కళాశాల యాజమాన్యం!
- కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు
- సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన విద్యార్థినులు..
- సంస్కృతి సాంప్రదాయాలే నిజమైన వారసత్వం
- యువతరం మూలాలను మరువకూడదు
- చైర్మన్ రవికుమార్, డైరెక్టర్ జమున

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 09 (డీడీ9 వార్త):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు గోదావరిఖని మార్కండేయ కాలనీలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు..సంప్రదాయదుస్తుల్లోముస్తాబైన విద్యార్థినులు.. జానపద గీతాలు, చప్పట్ల సవ్వడితో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.

విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన యాజమాన్యం


వేడుకల్లో కళాశాల చైర్మన్ డాక్టర్ రవికుమార్ నాగండ్ల, డైరెక్టర్ నాగండ్ల జమున, ప్రిన్సిపల్ ఎం. వెంకన్న, వైస్ ప్రిన్సిపల్ ఆర్. నరసింహా రావు, అధ్యాపకులు విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. యాజమాన్యం స్వయంగా వేడుకల్లో పాల్గొనడంతో విద్యార్థినుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. తంగేడు, గునుగు, బంతి, చామంతి, గులాబీ తదితర పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి, సంప్రదాయ పాటలు పాడుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ విద్యార్థినులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలే నిజమైన వారసత్వం

ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ రవికుమార్ నాగండ్ల మాట్లాడుతూ.. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, మన సంస్కృతి వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, మన సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ విలువలపై అవగాహన కల్పించడం కూడా విద్యాసంస్థల బాధ్యతని అన్నారు. ఆధునిక యుగంలో యువత తమ మూలాలను మరచిపోకుండా తెలంగాణ వారసత్వాన్ని గౌరవించాలని సూచించారు.

విద్యతోపాటు సంస్కృతికి ప్రాధాన్యం

డైరెక్టర్ నాగండ్ల జమున మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చదువుతోపాటు సాంస్కృతిక చైతన్యం, ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని తెలిపారు. సంప్రదాయ పండుగల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను సాగనంపి, ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు. పూల పండుగ సందడితో కళాశాల ప్రాంగణమంతా ఆనందోత్సాహాలతో నిండిపోయింది.



ఎస్సీ అదేశాలతో పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు

- మల్లంపల్లిలో ముమ్మర వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.
- డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు నిర్వహించిన ఎస్సై చంద్ర శేఖర్

ములుగు, డిడి 9 వార్త :


మల్లంపల్లి మండలం శ్రీనగర్ క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముమ్మర వాహన తనిఖీలు పోలీసులు చేపట్టారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకేన్ ఆదేశాలతో ఇసుక లారీల అతివేగం,డ్రైవర్ల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేయడం లో భాగంగా ముమ్మర తనిఖీలు చేపట్టామని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మల్లంపల్లి శ్రీనగర్ ప్రధాన రహదారిపై వెళ్తున్న ఇసుక లారీలను ఆపి తనిఖీ చేశారు. స్పీడ్ లిమిట్ దాటి వెళ్తున్న లారీలను గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు,కొంతమంది లారీ డ్రైవర్లు మద్యం సేవించి,అతివేగంతో వాహనాలు నడుపుతూ ప్రజల ప్రాణాలకు ఆటంకం కలిగేలా ప్రవర్తిస్తున్న తీర్పు అడ్డుకట్ట వేసే ఉద్దేశంలో భాగంలోనే వాహన తనిఖీలు చేపట్టామని తెలిపారు.రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ఇసుక లారీల అతివేగమేనని,ఇకపై స్పీడ్ లిమిట్ దాటితే లారీలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

లారీలకు తప్పనిసరిగా స్పీడ్‌లాక్ ఉండాలని, డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.ప్రతిరోజూ తనిఖీలు కొనసాగుతాయని, ప్రజల భద్రతే తమ లక్ష్యమని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

డీడీ9 వార్త,బోనకల్:

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ లింగంలేని నళిని శ్రీ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలలో బతుకమ్మ పండుగ పెద్దదని భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో ఆచరించాలని తెలియజేశారు. బతుకమ్మ సంబరాలను ప్రిన్సిపాల్ లింగంలేని నళిని శ్రీ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆట పాటలతో అలరించారు వీరితోపాటు అధ్యాపకులు అందరూ కూడా బతుకమ్మ సంబరాలలో పాల్గొని పిల్లలను ఉత్సాహపరిచారు. ఇలాంటి కార్యక్రమంలో అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతి ప్రియ, లైబ్రరీన్ మోహన్, యుడిసి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.




చేగువేరా విప్లవ స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి

- ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా చేగువేరా 59వ వర్ధంతి

డీడీ9 వార్త, మధిర :

చేగువేరా విప్లవ స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మధిర మండల కార్యదర్శి సంపసాల సాయి అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మధిర మండలం ఉపాధ్యక్షులు కొండూరు వెంకటకృష్ణ. ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్ సంఘాల మధిర మండల సమితి ఆధ్వర్యంలో మధిర పట్టణం లో చేగువేరా 59వ వర్ధంతి సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మధిర మండల నాయకులు అశోక్ జస్వంత్ చంద్రహాస్ వివేక్ వెంకీ నరేంద్ర వెంకట్ క్రాంతి మణికంఠ ఉపేంద్ర నరేంద్ర మురళి ప్రణయ్ గోపి రవి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


- ఆర్జీ-3 జీఎంకు బీజేపీ లేబర్ సెల్ వినతి

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 09 (డీడీ9 వార్త):

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నర్సయ్య ఆధ్వర్యంలో ఆర్జీ3 ఏరియా జీఎం ఎస్. మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎంను శాలువాతో సత్కరించారు. కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రంలో వివరించారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కోకన్వీనర్ ఎల్తూరి రాజయ్య, జనగామ మండల కన్వీనర్ బియ్యాల మహేందర్, లక్ష్మీ నగర్ మండల కన్వీనర్ వీరబోయిన శ్రీనివాస్ యాదవ్, తిలక్‌నగర్ మండల కన్వీనర్ జక్కుల ప్రవీణ్, ఎన్టీపీసీ మండల కన్వీనర్ ఎరుకొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా ప్రజా ప్రభుత్వం..

- **70 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

మణుగూరు. అక్టోబర్ 9 (డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 70 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.70,08,120 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు ఆర్థిక భారంగా మారకుండా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. ఈ పథకాలు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ, ఆడబిడ్డల వివాహాలను గౌరవప్రదంగా నిర్వహించుకునేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పేద కుటుంబాల అభ్యున్నతే లక్ష్యంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జములా రెడ్డి, ఎంపీవో రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ చారి, మండల హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి వారాల వేణు, స్థానిక సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, పార్టీ నియోజకవర్గ ఈబ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, సర్పంచులు బాదం వెంకటేశ్వర రెడ్డి, పూనెం సురేందర్, బానోత్ పద్మ, బొర్ర సుభద్ర, తాటి వాణి, తాటి లక్ష్మి, బొల్లి నిరోష, శర్వ నాగమణి, మాజీ ఎంపీపీ కైపు రోసిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, యువజన నాయకులు భజన ప్రసాద్, చల్లా వెంకటనారాయణ, బాదం రమేష్ రెడ్డి, ఇంగువ రమేష్, పార్టీ మండల యువజన అధ్యక్షుడు హరీష్, యువజన విభాగం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రహీమ్ ఖాన్, మండల యువజన విభాగం ఉపాధ్యక్షుడు సుశాంత్ రెడ్డి, కైపు శ్రీనివాస రెడ్డి, దాసరి సాంబ, చిప్పా రాజు, కాటం వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



బతుకమ్మ నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన... ఎంపీఓ & సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ లు

మణుగూరు. అక్టోబర్ 9 (డి డి 9వార్త)

మణుగూరు మండలం, సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో నేటి నుంచి ప్రారంభం కాబోవు తెలంగాణ సాంస్కృతిక పండుగ బతుకమ్మ వేడుకలకు సంబంధించిన బతుకమ్మ నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్లను మణుగూరు ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ లు శుక్రవారం నాడు పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మరియు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గార్ల ఆదేశాల మేరకు సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో బతుకమ్మ నిమజ్జన ఘాట్ల వద్ద అన్ని రకాల సౌకర్యాలను కలిగించడం జరిగిందని, భక్తులు వాటిని సద్వినియోగం చేసుకొని ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జక్కుల అశోక్ కుమార్, సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కోల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు గోపాలకృష్ణ ఎంపిక!

- **సింగరేణి స్థాయి పోటీల్లో 60 కేజీల విభాగంలో బంగారు పతకం కైవసం**

పెద్దపల్లి బ్యూరో,
అక్టోబరు 09 (డీడీ9 వార్త):

సింగరేణి సంస్థ స్థాయిలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో జీడీకే ఆర్జీ2 ఏరియాకు చెందిన కార్మికుడు గోపాలకృష్ణ సత్తా చాటారు. 60 కేజీల వెయిట్ కేటగిరీలో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఈ విజయంతో కోల్ ఇండియా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యారు.

సింగరేణి స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించి కోల్ ఇండియా పోటీలకు అర్హత సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గోపాలకృష్ణ కోల్ ఇండియా స్థాయి పోటీల్లోనూ విజయం సాధించి సంస్థకు, గోదావరిఖనికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు.

ఇసుక లారీలపై పోలీసుల కొరడా..!

- **అతివేగానికి బ్రేక్.. ప్రమాదాలకు చెక్..!**
- **జిల్లా ఆది నుంచి అంతం వరకు 24/7 తనిఖీలు.**
- **స్పీడ్ లిమిట్ దాటితే చర్యలు తప్పవు..**
- **రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్పీ కఠిన ఆదేశాలు.**

ఏటూరునాగారం,
క్రైం | డీడీ9 వార్త | అక్టోబర్ 09





ములుగు జిల్లా ఇసుక లారీల అతివేగానికి అడ్డుకట్ట పడేనా..? రహదారులపై మృత్యుశకటాల్లా దూసుకెళ్తున్న లారీలకు కళ్లెం పడేనా..? వరుస రోడ్డు ప్రమాదాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న నేపథ్యంలో ములుగు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా ఆది నుంచి అంతం వరకు నిరంతర తనిఖీలు చేపట్టాలని ,ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు.

ఇక నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలే...!

జిల్లాలో ఇసుక లారీల అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం,నిద్రలేమి వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు.ప్రధాన రహదారులు, చెక్‌పోస్టులు,ప్రమాదకర ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను కేటాయించి 24 గంటల పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా కమలాపురం,మండపాక, తాడ్వాయి ,జవహర్‌నగర్ టోల్‌గేట్ తదితర ప్రాంతాల్లో తనిఖీలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించవద్దని,రహదారి భద్రత విషయంలో కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

లారీలకు స్పీడ్ లాక్.. అతివేగానికి కళ్లెం..!

ఇసుక లారీల వేగ నియంత్రణ ఇప్పుడు కీలకంగా మారింది.ఇసుక రవాణా వాహనాల కారణంగా జరుగుతున్న ప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై టీఎస్ఎండీసీ ఉన్నతాధికారులతో ఎస్పీ చర్చించారు.లారీల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ లాక్ వంటి చర్యల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా అతివేగంతో దూసుకెళ్లే వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని,అవసరమైన చోట ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్లు, చెక్‌పోస్టులు,ప్రధాన రహదారులు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు.

ప్రమాదాల తర్వాత మేల్కొంటే సరిపోదు..!

రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే,ప్రమాదాలు జరగకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టడమే ముఖ్యమని ఎస్పీ అధికారులకు సూచించారు. స్థానిక ఎస్ఐలు తమ పరిధిలోని ఇసుక లారీ డ్రైవర్లతో సమావేశాలు నిర్వహించి,అతివేగం,మద్యం సేవించి వాహనాలు నడపడం,నిద్రలేమి వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని,జిల్లాలో ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

ఎస్పీ ఆదేశాలు..

సమావేశంలో ఉన్నతాధికారులు

నేర సమీక్షా సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్ ఐపీఎస్,అదనపు ఎస్పీ సదానందం, ములుగు సబ్ డివిజనల్ పోలీసు అధికారి రవీందర్,డీసీఆర్‌బీ డీఎస్పీ కిషోర్ కుమార్,ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్,స్థానిక సీఐలు ,ఆర్‌మ్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు,ఎస్ఐలు,ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.ఇసుక లారీల వేగానికి నిజంగానే బ్రేక్ పడుతుందా..? తనిఖీలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవుతాయా..? అన్నది ఇప్పుడు ప్రజల్లో నెలకొన్న ప్రశ్న.ప్రమాదాలు జరిగినప్పుడే హడావుడి కాకుండా, నిరంతర నిఘా,కఠిన అమలుతో ప్రయాణికుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



ఎంగిలిపూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

- **దసరా నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలనిఆకాంక్ష.**

మణుగూరు. అక్టోబర్ 9 (డి డి 9వార్త)



పినపాక నియోజకవర్గ ప్రజలందరికీ ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా,ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రకృతిని పూజిస్తూ, పూలను అందంగా పేర్చి బతుకమ్మను కొలిచే ఈ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీక అని తెలిపారు.

అదేవిధంగా, దసరా నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

పినపాక నియోజకవర్గ ప్రజలందరూ బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకుంటూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

జనగాం అక్టోబర్ 9 (డిడి9) వార్త

జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల చైర్మన్ చిట్ల రాజేందర్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేస్తూ పండుగ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా చాటిచెప్పారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఈదులకంటి రాజు, అనిల్, కిషన్, వినయ్, దేవ, కుమార్, రామన్, మధు, కర్ణాకర్, రాజేష్, రవి, అనూష తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సి డిపార్ట్మెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా భాషపాక కుమార్

జనగామ అక్టోబర్ 9 (డిడి9) వార్త



జనగామ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు లకావత్ దన్వంతి చేతుల మీదుగా ఎస్సీ డిపార్టుమెంటు జిల్లా చైర్మన్ వేముల మల్లేష్ తో కలిసి ఎస్సీ డిపార్టుమెంటు జిల్లా కార్యదర్శి నియామక పత్రాన్ని యశ్వంతపూర్ గ్రామానికి చెందిన బొట్ల విజయ్ కుమార్ అందుకున్నారు తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు

మణుగూరు ఆర్టీసీ కార్మికుల ఎన్నికల ప్రచారం లో సిపిఐ నాయకులు.

- **కార్మికుల సమస్యలు మరియు హక్కుల కోసం పోరాడే యూనియన్ లకే ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి.**

మణుగూరు. అక్టోబర్ 9(డి డి 9వార్త)

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి ఆర్టీసీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం నాడు మణుగూరు ఆర్టీసీ డిపో ముందు సిపిఐ నాయకులు మరియు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంస్థలో నెలకొన్న సమస్యలపై పోరాటం చేస్తూ ,కార్మికుల హక్కులు మరియు సంక్షేమం కోసం పాటుపడే యూనియన్ లకే పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు,ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు,సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్,మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్,పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, యాకూబ్,, ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



కాన్షీరాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి..!

- **బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం**

శాయంపేట, అక్టోబర్ 9,డి డి 9వార్త

బహుజనుల హక్కుల సాధన, సామాజిక సమానత్వం, రాజ్యాధికారమే లక్ష్యంగా జీవితాంతం కృషి చేసిన మాన్యశ్రీ కాన్షీరాం ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మారపెల్లి క్రాంత్ కుమార్ పిలుపునిచ్చారు.హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో బహుజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి,కాన్షీరాం చేసిన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా మారపెల్లి క్రాంత్ కుమార్ మాట్లాడుతూ బహుజన రాజ్యాధికార సాధన కోసం కాన్షీరాం తన జీవితాన్ని అంకితం చేశారని,అణగారిన వర్గాల్లో రాజకీయ చైతన్యం నింపి,వారి హక్కుల కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు.బహుజనుల ఆత్మగౌరవానికి,సామాజిక చైతన్యానికి ఆయన ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.ఆయన చూపిన మార్గంలో నడుస్తూ,ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అన్నారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌కు దళిత మహిళ అయిన బెహన్‌జీ మాయావతి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంలో కాన్షీరాం కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, వారు అధికారంలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. సమాజంలో కుల వివక్ష, అసమానతలు కొనసాగుతున్న పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బహుజనుల హక్కుల పరిరక్షణ, విద్య,సామాజిక న్యాయం,రాజకీయ చైతన్యం కోసం కృషి చేయడమే కాన్షీరాంకు అర్పించే నిజమైన నివాలని అన్నారు.ఆయన ఆశయాలను భావితరాలకు తెలియజేస్తూ ,సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్,హనుమకొండ జిల్లా కార్యదర్శి మారపెల్లి విజయ్ కుమార్, శాయంపేట మండల అధ్యక్షులు మారెపల్లి సుధాకర్,రాజేష్,నాలికె రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక మాఫియాపై ఈనెల 12 వ తేదీ నుంచి భద్రాద్రి జిల్లా BRS పార్టీ ఆధ్వర్యంలో

దశలవారి ఆందోళన కార్యక్రమాలకు పిలుపు.

- బినామీలను పెట్టుకుని కోట్ల రూపాయల ఖనిజ సంపదను దోచుకుని జేబులు నింపుకుంటున్నారు.
- DMFT & CSR నిధులు ఎక్కడికి తరలి పోతున్నాయి.
- భాధ్యత కలిగిన ప్రతిపక్షంగా గొంతెత్తక పోతే చరిత్ర కూడా మనలను క్షమించదు.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు.

మణుగూరు. అక్టోబర్ 9 (డి డి 9వార్త)

అడ్డదిడ్డంగా అధిక లోడ్ వేసుకొని, అంతు పంతులేని స్పీడ్ తో నడుస్తున్న ఇసుక లారీల వలన రహదారులు అన్ని కనీవినీ ఎరుగని, ఎన్నడూ చూడని స్థాయిలో పాడైపోయి దెబ్బతిన్నా, ఎన్నో ఇసుక లారీల ప్రమాదాలలో ఎంతమంది అమాయక ప్రజలు చనిపోయినా.. వృద్ధాప్యంలో చేతికి అందిన కొడుకులు ప్రమాదాలు జరిగి అంగవైకల్యులుగా,విగతజీవులుగా మిగిలినా కానీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని పినపాక మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు.

ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వ పెద్దలు సీఎం రేవంత్ రెడ్డి, భద్రాద్రి జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు, ములుగు మంత్రి సీతక్క దండుపాలెం బ్యాచ్ లా గోదావరిని లూటీ చేస్తున్నారని, ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఇప్పటివరకు ప్రజలకు ఒరిగింది, ఒనగూరింది ఏంటి? అని ఆయన ప్రశ్నించారు.ప్రజలు మేధావులు విద్యార్థులు ఉద్యోగులు నిరుద్యోగులు వ్యాపార వర్గాలు ఆలోచించాలని రేగా విజ్ఞప్తి చేశారు. దుఃఖం, శోఖం, కడుపుకోత తప్ప ఏమొచ్చింది మనకు. ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి స్వలాభం కోసం వారి బినామీలను పెట్టి కొన్ని కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద దోచుకొని జేబులు నింపుకుంటున్నారు అని ఆయన ఆరోపించారు. DMFT & CSR లాంటి చట్టాలు కటినంగా ఉన్నా..

ఆ నిధులు ఏమవుతున్నాయి అని రోడ్ల పరిస్థితి మునుపెన్నడూ లేని విధంగా తయారయ్యాయని ఆయన దుయ్యబట్టారు.

అనేక సందర్భాలలో ప్రశ్నించినా నోరుమెదపని ప్రభుత్వ జిల్లా పెద్దలు.

తీరా ఆనిధులు ఏమవుతున్నాయని ఆరా తీస్తే రేవంత్ రెడ్డి మనవడి సంతోషం కోసం ప్రపంచ దిగ్గజం మెస్సి అనే ఫుట్ బాల్ ఆటగాడిని పిలిపించి ఫుట్ బాల్ ఆటకోసం 100 కోట్లు CSR నిధులను ఖర్చు చేసింది ఈ ప్రభుత్వం. యంగ్ ఇండియా స్కూల్స్ పేరుతో మరియు ప్రభుత్వ పెద్దల నియోజకవర్గాలలో పెద్దఎత్తున అభివృద్ధికి మనప్రాంత వందలకోట్ల నిధులను తరలిస్తున్నారని, మనప్రాంత MLA లు వారి గురువులుగా భావించే పొంగులేటి లాంటి పెట్టుబడిదారులను ప్రశ్నించలేక సర్పంచుల కంటే అధ్వాన్నంగా మిగిలారు అని,దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా ఉన్నారని, అందుకే వీరిని ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలపెట్టే వరకు పోరాటం చేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రాంత నాయకులుగా బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా ఈ ప్రభుత్వం పై గొంతెత్తక పోతే, పోరాడకపోతే చరిత్ర మనలను కూడా క్షమించదు. మనప్రాంత ప్రజల కోసం పోరాడుదాం పోరాడకపోతే మన ప్రజలకు దుఃఖం, వారి ప్రాంత ప్రజలకు సంతోషం మిగులుద్ది అని స్పష్టం చేశారు.అందుకే BRS పార్టీ ఆధ్వర్యంలో గోదావరి నదీ ప్రాంత ప్రజల గొంతుకై వారి హక్కులకై నిధుల తరలింపు ఆపాలని ఈ ప్రాంత అభివృద్ధికి మైనింగ్ నిధులను ఈ ప్రాంతానికే కేటాయించాలని ప్రజాపోరాటానికి దశలవారీ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్టు రేగా కాంతారావు తెలియచేశారు. (నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో చిన్నమార్పు గమనించాలని పినపాక నియోజక వర్గ స్థాయి కార్యక్రమం మణుగూరు లో నిర్వహిస్తారు. భద్రాచలం నియోజకవర్గ స్థాయి రెండు చోట్ల నిర్వహిస్తారు దుమ్ముగూడెం చర్ల మండలాలు కలిపి భద్రాచలం కేంద్రంలో వెంకటాపురం వాజేడు మండలాలు కలిపి వెంకటాపురం కేంద్రంలో కార్యక్రమం నిర్వహిస్తారు).



జిల్లా వ్యాప్తంగా ఉన్న BRS నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సమయానికి హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని రేగా విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమాల వివరాలు :-

తేదీ.12.10.2026 న ఇసుక క్వారీల వద్ద రాస్తారోకో ధర్నాలు పరిశీలన.

తేదీ 17.10.2026 న అన్ని గ్రామపంచాయితీ ఆఫీసుల ముందు ధర్నా.

తేదీ 22.10.2026 న అన్ని మండలాల ప్రధాన రహదారి కూడళ్ళ వద్ద రాస్తారోకో & ధర్నా.

తేదీ 30.10.2026 న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ధర్నా & రాస్తారోకో

తేదీ 05.11.2026 న కలెక్టరేట్ ముట్టడి & ధర్నా.



శాయంపేటలో అంగరంగ వైభవంగా దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- ఎస్పీటీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణకు ఏర్పాట్లు
- ఉత్సవాల ఆగమన పోస్టర్ ఆవిష్కరణ

శాయంపేట, అక్టోబర్ 09,డి డి 9వార్త

హనుమకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఈసారి గతంలో కంటే మరింత అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఎస్పీటీ యూత్ అసోసియేషన్ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు.ఈ మేరకు ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ప్రారంభించారు.శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి ఆగమన పోస్టర్ను శుక్రవారం మండలంలోని ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాల నిర్వహణకు సన్నాహాలు...

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో,వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారు. మండల ప్రజల భాగస్వామ్యంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు ఆకాంక్షిస్తున్నారు.ఈ సందర్భంగా శాయంపేట మండల ప్రజలందరూ సహకరించి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎస్పీటీ యూత్ అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతల ఉమా రవిపాల్, స్థానిక ఎస్సై జక్కుల పరమేశ్వర్,శ్రీ మత్స్యగిరి దేవస్థానం ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్,మహిళా మండలి సభ్యులు,ఎస్పీటీ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి, షాది ముభారాక్ చెక్కులు

- పంపిణీ చేసిన ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి
- రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు ,
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో

తాడ్వాయిడిడి9 వార్త

తాడ్వాయి మండలానికి చెందిన సుమారు 24 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముభారాక్ చెక్కులను తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి ఆధ్వర్యంలో ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి పంపిణీ చేశారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాది ముభారాక్ వల్ల ప్రతి కుటుంబానికి ఒక వరంలా మారిందని అన్నారు..ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి తాడ్వాయి మండలంలో అనేక అభివృద్ధి పనులను మంత్రి సీతక్క సహకారంతో జరుగుతున్నాయని ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు.

ఈకార్యక్రమంలో ఎమ్మార్వో సురేష్ బాబు , ఎంపిడిఓ తేజ తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంకిడి నరసింహ స్వామి , కామారం సర్పంచ్ కోర్నబెల్లి సావిత్రి , నార్లపూర్ సర్పంచ్ తోలెం కృష్ణ , అంకంపల్లి సర్పంచ్ ఇర్ప వెంకటేశ్వర్లు , దామరవాయి సర్పంచ్ వట్టం తిరుపతయ్య , మల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ డైరెక్టర్ పల్నాటి సత్యం , యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు చిరంజీవి , మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు





లిటిల్ జీనియస్ ప్లే స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 09 (డీడీ9 వార్త):


స్థానిక మార్కండేయ కాలనీలోని శ్రీ లిటిల్ జీనియస్ ప్లే స్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 48వ డివిజన్ కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి హాజరయ్యారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

విద్యార్థినులకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

- జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింతగా విస్తరిస్తాం
- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి చైర్మన్ డా. ఎస్.ఎల్. కాంతారావు

భద్రాచలంటౌన్, అక్టోబరు 9 (డీడీ 9 వార్త)

జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా సేవలను మరింతగా విస్తరిస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి చైర్మన్ డా. ఎస్.ఎల్.కాంతారావు అన్నారు. భద్రాచలంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో భద్రాచలం గిరిజన గురుకుల కళాశాలలో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలు, ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ మొదటి ఫేజ్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఆర్ఎస్ జిల్లా చైర్మన్, వైస్ చైర్మన్లు డా.ఎస్ఎల్ కాంతారావు, చల్లగుళ్ల నాగేశ్వరరావులు మాట్లాడుతూ మొదటి దఫాలో ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ స్కూల్స్, గిరిజన పాఠశాలలు 95 విద్యాసంస్థల్లో 25 వేల మందికి ఉచిత కంటి పరీక్షలు, అవసరమైన వారికి ఉచిత కళ్ళజోళ్ళ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రెండవ ఫేజ్లో సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్ కళాశాలల్లో ఈ కార్యక్రమం చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమానికి మ్యాక్సివిజన్ శరత్ ఖమ్మం వారి టెక్నికల్ టీమ్ సహకారం అందజేస్తున్నారని, ఈ ఉచిత శిబిరంలో 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. సుమలత, వైస్ ప్రిన్సిపాల్ పుణ్యవతి,రెడ్‌క్రాస్ కోశాధికారి టి.వి. బాలయోగి, సభ్యులు వై.సూర్యనారాయణ, జిల్లా కమిటి మెంబర్స్ యడవెల్లి కృష్ణ, అవులూరి సత్యనారాయణ, బిబిజి తిలక్, పల్లంటి దేశప్ప, కంభంపాటి రవి, కందెలవాల సతీష్, ఆదినారాయణ పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో మహిళ దుర్మరణం!!

- పండుగ వస్తుందని,ఇంట్లో అటుకుపైన సాసుట్టు దులుపు తుండె...
- కరెంటుతీగె తెగిమీద పడిషాక్ తగిలె...
- అక్కడి కక్కడె దుర్మరణం చెందెను...
- విద్యుత్ సరఫరా నిలిపి చుస్తె అప్పటికె మృతిచెందె...
- పోలీసులు కేసునమోదు దర్యాప్తు...

ఏటురునాగారం,క్రైం డి డి 9,వార్త.



దసరా పండుగ పూటసంతొసంగం ఉండవలసిన ఆ కుటుంబం విషాద వదనంతొ శోకసముద్రంలొ ఉంది, నర్సింగపురంలొ ఒ ఇంటి లొ విద్యుత్ షాక్ దుర్ఘటన తొ చోటుచేసు కుంది,వివ రాల్లోకి వెలితె,

ములుగు జిల్లా తాడ్వాయి మండలం నర్సింగాపూర్ గ్రామంలో దసరా పండుగ కోసం ఇంటిని శుభ్రం చేస్తుం డగా ప్రమాదవశాత్తు విద్యు త్ షాక్ తగిలి ఓ వృద్ధురాలు మృతి చెందింది.

వివరాల్లోకి వెళితే, నర్సిం గాపూర్ గ్రామానికి చెందిన పిట్టల ప్రమీల (69), భర్త సాంబయ్య, వ్యవ సాయం చేసుకుంటూ జీవనం సాగి స్తోంది. ఆమె కుమారుడు శంకర్ ఉపాధి నిమిత్తం వరంగల్‌లో నివసిస్తున్నా డు. దసరా పండుగ సందర్భంగా కుమారుడు ఇంటికి వస్తుండటంతో, అతని కోసం కేటాయించిన గదిని శుభ్రం చేస్తూ పైకప్పు ను సరిచేస్తుండగా, ప్రమాదవశాత్తు అక్కడ వేలాడు తున్న విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురైంది.ఈ క్రమంలో ఆమె కుడి చేతి మోచేయి, పొట్టపై కాలిన గాయాలు ఏర్పడి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి చూడగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు గుర్తిం చారు.మృతురాలి కుమార్తె రేగుల స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు, తాడ్వా యి పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు.

బతుకమ్మ సంబరాలకు సర్వం సిద్ధం...!

- మహిళలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- తాళ్లకుంట పరిసరాలను శుభ్రం చేయించిన సర్పంచ్ చింతల ఉమా–రవిపాల్

శాయంపేట, అక్టోబర్ 9, డి డి 9వార్త

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు శాయంపేటలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ పాలకవర్గం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది.ఇందులో భాగంగా హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలోని తాళ్లకుంట సమీపంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రదేశాన్ని శుభ్రం చేయించారు. శుక్రవారం సర్పంచ్ చింతల ఉమా-రవిపాల్ పాలకవర్గ సభ్యులతో కలిసి ట్రాక్టర్ సహాయంతో గడ్డి,పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేయించారు. మహిళలు బతుకమ్మలను పేర్చి,సంప్రదాయ ఆటపాటలతో వేడుకల్లో పాల్గొనేందుకు అనువుగా స్థలాన్ని సిద్ధం చేశారు.పండుగ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ముందస్తు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రదేశాన్ని సిద్ధం చేయడంతో పాటు, వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పాలకవర్గం సహకారం అందిస్తోంది. గ్రామంలో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు ముందుకు రావడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాలకవర్గం తీసుకున్న చొరవ అభినందనీయం..


తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం తీసుకున్న చొరవ అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.మహిళల భాగస్వామ్యంతో పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని పాలకవర్గం తెలిపింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొని శుభ్రత పనులకు సహకరించారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

- భద్రాద్రి రామయ్యకు వైభవంగా నిత్యకల్యాణం

భద్రాచలం టౌన్, అక్టోబరు 9 (డీ డీ 9 వార్త)



భద్రాచలంలోని శ్రీ సీతా రామ చంద్ర స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ముందుగా శ్రీరామ సేవ మండపంలో స్వామివారిని అందంగా అలంకరించి వేదికపై ఆసీనులను చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణ ప్రక్రియను వైదిక బృందం ప్రారంభించారు. ముందుగా స్వామి వారికి పూజలు నిర్వహించి అనంతరం భక్తుల గోత్రనామాలను చదివి వినిపించారు. అనంతరం కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేన అర్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక బృందం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు..


- R&B అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు.

మణుగూరు. అక్టోబర్ 9 (డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు R&B (రోడ్లు, భవనాల శాఖ) అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని రహదారుల పరిస్థితి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నిర్మాణంలో ఉన్న రహదారుల పురోగతి తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట కొత్త రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ప్రభుత్వం మంజూరు చేసిన రహదారి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వాహనదారులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధి పనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.





బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

- ఘనంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి రావులపల్లి రాంప్రసాద్ జన్మదిన వేడుకలు


భద్రాచలం టౌన్ , అక్టోబర్ 9,(డీడీ 9 వార్త)

భద్రాచలం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి రావులపల్లి రాంప్రసాద్ జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణంలోని తెలంగాణ టూరిజం హరిత హోటల్ లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు కోటగిరి ప్రబోద్‌కుమార్, ఆకోజు సునీల్ కుమార్, రావులపల్లి పృధ్వీ, రేపాక పూర్ణలు మాట్లాడుతూ రావులపల్లి రాంప్రసాద్ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న నాయకుడని కొనియాడారు. ప్రజల హక్కుల పరిరక్షణ, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఆయన ముందుకు సాగుతున్నారని అన్నారు. భద్రాచలం ప్రాంత అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాంప్రసాద్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న దృశ్యం

- ఘనంగా బతుకమ్మ సంబరాలు

భద్రాచలం టౌన్, అక్టోబర్ 9 (డీడీ 9 వార్త)



భద్రాచలంలోని ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ ఏ, బీ హాస్టళ్లలో వార్డెన్ స్వరాజ్యం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థినులు తమ స్వగ్రామాలకు వెళ్లనున్నందున ముందస్తుగా బతుకమ్మ సంబరాలను నిర్వహించినట్లు తెలిపారు.



సోనాల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- సానాల తహసిల్దార్ గారికి వినతి పత్రం అందించిన బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచులు నాయకులు

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: అక్టోబర్ 09: (డిడి 9 వార్త న్యూస్):

ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణంగా కురవాల్సిన వర్షపాతం కంటే అత్యల్ప వర్షపాతం నమోదవుతున్నందున, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు ఆశించిన దిగుబడి వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ముఖ్యంగా సోనాల మండల రైతులు వర్షాధారంగానే పంటలు సాగు చేస్తున్నారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో సరైన వర్షాలు లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో పత్తి పంట ఎండిపోయే దశకు చేరుకుంది. అంతేకాకుండా, రానున్న రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకునే పరిస్థితులు కూడా ఆశాజనకంగా లేవు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న కాలంలో తాగునీటి కొరత కూడా తీవ్రంగా ఏర్పడే ప్రమాదం ఉంది. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు మరియు గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. కావున, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సోనాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించలని అదేవిధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని, రైతులకు వ్యవసాయ పనిముట్లు, నాణ్యమైన విత్తనాలు మరియు ఇతర అవసరమైన వ్యవసాయ వనరులను సబ్సిడీ ద్వారా అందించాలని సోనాల ఎమ్మార్వో మల్లేష్ సార్ గారికి వినతి పత్రం అందించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సోనాల సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి, సాకేర సర్పంచ్ నానాజీ, గుర్రాల తండా సర్పంచ్ కటరె దినేష్, దేవుళ్ళ నాయక్ తండా సర్పంచ్ బాబూలాల్ , కేశవ్ కూడా సర్పంచ్ కిసాన్ , గుట్ట పక్క తండ సర్పంచ్, గులాబ్ సింగ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మాన్ సింగ్, సోనాల పట్టణ అధ్యక్షులు చిన్నయ్య సోనాల ఉప సర్పంచ్ శ్రీకాంత్ మాజీ సర్పంచ్ సకారం, నాయకులు అభిలాష్, ఈశ్వర్, రమేష్, బద్ధం శ్రీను తదితరులు పాల్గొన్నారు



ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 09: (డిడి 9 వార్త న్యూస్):

బోథ్ స్థానిక వాగ్దేవి జూనియర్ డిగ్రీ డిఫెన్స్ కళాశాల బోథ్ యందు ఎన్ఎస్ఎస్ బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా వివిధ రకాల పూలతో బతుకమ్మను తయారు చేశారు కళాశాల కరస్పాండెంట్ ఈ రాజశేఖర్ ప్రిన్సిపల్ ఆర్ శ్రీనివాసులు బతుకమ్మకు పూజలను నిర్వహించిన అనంతరం విద్యార్థులు బతుకమ్మ సంబరాలను జరుపుతూ వివిధ బతుకమ్మ పాటల పైన నృత్యాలను చేశారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు రాజేశ్వర్ మల్లిక ప్రశాంత్ అధ్యాపకులు పాల్గొన్నారు



నేడే ఎంగిలిపూల బతుకమ్మ..

- తెలంగాణ ఆడపడుచుల సంబురాలకు శ్రీకారం..!
- తంగేడు, రకరకాల పూలతో బతుకమ్మల పేర్పు..
- ఆటపాటలతో మారుమోగనున్న పల్లెలు!
- కాటాపురంలో ఘనంగా బొడ్డెమ్మ వేడుకల ముగింపు.. గంగమ్మ ఒడికి బొడ్డెమ్మ

ఏటూరునాగారం క్రైం, డి డి 9వార్త,అక్టోబర్ 9:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు నేడు శ్రీకారం చుట్టనున్నారు.ఎంగిలిపూల అమావాస్యతో ప్రారంభమయ్యే బతుకమ్మ సంబురాలు రాష్ట్ర వ్యాప్తంగా ఆడపడుచుల్లో ఆనందోత్సాహాలను నింపనున్నాయి. ప్రకృతిలో లభించే తంగేడు,గునుగు తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, పసుపు,కుంకుమలతో అలంకరించి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించనున్నారు.

బతుకమ్మ పాటలతో పల్లెల్లో సందడి..!

ములుగు జిల్లాలోని గ్రామగ్రామాన మహిళలు బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.ఇంటి వద్ద పూలతో పేర్చిన బతుకమ్మలను తీసుకుని నిర్ణీత ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన గద్దెల వద్దకు చేరుకుని,వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేయనున్నారు.బతుకమ్మను గౌరమ్మగా భావించి పూజలు నిర్వహిస్తూ,కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటారు.

శుక్రవారంతో బొడ్డెమ్మ వేడుకలకు ముగింపు..!

బతుకమ్మ పండుగకు ముందు నిర్వహించే బొడ్డెమ్మ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ములుగు జిల్లా కాటాపురం గ్రామంలోని రామాలయం,క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లో మహిళలు ఎనిమిది రోజులపాటు బొడ్డెమ్మను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు.



కాటాపురంలో ఆటపాటలతో చివరి రోజు సంబురాలు..!

బొడ్డెమ్మ వేడుకల్లో చివరి రోజైన శుక్రవారం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు.రాత్రి వరకు ఆటపాటలతో సందడి చేసిన మహిళలు,చివరగా "పోయి రావమ్మ బొడ్డెమ్మ.. మళ్లీ రావమ్మ బొడ్డెమ్మ" అంటూ పాటలు పాడుతూ బొడ్డెమ్మను ఊరేగింపుగా గ్రామ సమీపంలోని వాగు వద్దకు తీసుకెళ్లారు.అక్కడ గంగమ్మ ఒడిలో బొడ్డెమ్మను నిమజ్జనం చేసి వేడుకలకు ముగింపు పలికారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ..పూల పరిమళాలు,సంప్రదాయ పాటలు, ఆటపాటలతో తెలంగాణ పల్లెల్లో పండుగ శోభను నింపనుంది.

బహుజన చైతన్యమే ఆయుధం..!

- బహుజన రాజ్యాధికార సాధకుడు కాన్షీరాం ఆశయాలే మనకు స్ఫూర్తి!
- వెంకటాపురంలో ఘనంగా మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతి..

అక్టోబర్ 9, డిడి9 వార్త వెంకటాపురం.

వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో MRPS ఆధ్వర్యంలో బహుజన ఉద్యమ నేత, మాన్యశ్రీ కాన్షీరాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా MRPS వెంకటాపురం మండల అధ్యక్షుడు యాసం రమేష్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చైతన్యపరిచి, బహుజనుల రాజకీయ సాధికారత కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. సైకిల్ యాత్రలు, ఉద్యమాల ద్వారా బహుజనుల్లో రాజకీయ చైతన్యం నింపి, బహుజన్ సమాజ్ పార్టీ (BSP) స్థాపనతో బహుజన రాజ్యాధికారానికి బాటలు వేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. కాన్షీరాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బహుజనుల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ సాధికారత కోసం ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో MRPSసీనియర్‌నాయకులు వేల్పులమల్లేష్‌మాదిగ,యాసంమహేష్‌మాదిగ, MSPమండలఅధ్యక్షుడుకొడారిసత్యంమాదిగ, MRPS ఉపాధ్యక్షుడు చెన్నం తిరుపతి మాదిగ, కాటమహేష్‌తదితరులు పాల్గొన్నారు.



ధన్నూర్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 09: (డిడి 9 వార్త న్యూస్):

బోథ్ మండలంలోని దన్నూర్ బి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో ముందస్తు బతుకమ్మ పండుగ సంబరాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ మాట్లాడుతూ ఈనెల పదవ తారీఖు నుండి పాఠశాలలకు సెలవులు ఉండడంతో విద్యార్థులతో ముందుగా జరిపామన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి అందలో గౌరమ్మను కూర్చోబెట్టి విద్యార్థులు అందంగా తయారు చేశారన్నారు.పాఠశాలలో, గ్రామంలోని పురవీధుల గుండా తిరుగుతూ ,కూడళ్ళ వద్ద బతుకమ్మ పాటలతో నృత్యాలు చేసి చూపరులను అబ్బురపరచారన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రాథోడ్ సవిత, యాల్ల స్వప్న, మాడ ప్రశాంత్ కుమార్, బోనగిరి సారిక, సగ్గం ఉమారాణి, షేక్ వాజీద్ తదితరులు పాల్గొన్నారు



ఉప్లూర్‌లో లబ్ధిదారునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నిజామాబాద్, అక్టోబర్ 09 (డీడీ9 వార్త):

కమ్మర్ పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో అర్హులైన లబ్ధిదారుడు రంగుల అశోక్ గౌడ్‌కు గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ రూ.20 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొనే పేదలకు ఈ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన మాజీ సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డికి లబ్ధిదారుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తక్కూరి శేఖర్, నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, మాజీ సర్పంచ్ బద్దం రమేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బద్దం నగేష్ రెడ్డి, తిరుపతి రెడ్డి, ఫారుక్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా భారతి విద్యానికేతన్ లో బతుకమ్మ సంబరాలు..

- సంప్రదాయ దుస్తుల్లో సందడి చేసిన విద్యార్థులు..

అక్టోబర్ 09 డిడి9 వార్త వెంకటాపురం.

మండల కేంద్రంలో గల భారతి విద్యా నికేతన్ హైస్కూల్‌లో బతుకమ్మసంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను చాటుతూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బెజ్జని సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వేడుకలు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి.



రూ.3 లక్షలకు పైగా విలువైన టేకు కలప స్వాధీనం!

- ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి తరలింపునకు సిద్ధం..
- సూరవీడు కాలనీలో అటవీశాఖ దాడులు..

అక్టోబర్ 9.డిడి9 వార్త వెంకటాపురం.

వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఎదిర సెక్షన్ సూరవీడు కాలనీ పంట పొలాల్లో అక్రమంగా దాచిన పది టేకు దుంగలను అటవీశాఖ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న కలప పరిమాణం 1.522 క్యూబిక్ మీటర్లుగా ఉండగా, దాని విలువ రూ.3 లక్షలకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొత్తపల్లి అటవీ ప్రాంతం నుంచి టేకు కలపను తీసుకొచ్చి, వాహనాల ద్వారా తరలించేందుకు సిద్ధం చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎం.డి. ముక్తార్ హుస్సేన్‌కు అందిన విశ్వసనీయ సమాచారంతో అటవీశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి కలపను స్వాధీనం చేసుకున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న కలపను వెంకటాపురం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఈ దాడుల్లో ఎదిర సెక్షన్ ఆఫీసర్ బి. జైసింగ్, బీట్ ఆఫీసర్లు వసంత్ కుమార్, చంద్రమోహన్, బి. మోహన్, పవన్ హర్షతో పాటు ఇతర బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆమ్మవారి సేవలో ధన్‌పాల్ ట్రస్టు

నిజామాబాద్, అక్టోబర్ 09 (డీడీ9 వార్త):

దుర్గామాతకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్లు ఉదయ్ కుమార్, ప్రణయ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని మిర్చి కాంపౌండ్‌లో ఉన్న డీఎస్ఎన్ కార్యాలయంలో ట్రస్టు ఆధ్వర్యంలో అమ్మవారి మండపాల నిర్వాహకులకు పట్టు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ట్రస్టు ఆధ్వర్యంలో అమ్మవారి మండపాలకు పట్టు చీరలను అందజేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందూరు నియోజకవర్గంలోని ప్రతి మండపానికి తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను నియమ నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. ప్రతి ఏటా ఇందూరులో అమ్మవారి మండపాల సంఖ్య పెరుగుతుండటం, యువత భక్తి మార్గంలో పయనించడం సంతోషకరమని పేర్కొన్నారు. దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మఠం పవన్, బంటు రాము, మల్కాయి మహేందర్, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, ధాత్రిక పరమేశ్వర్, నాయకులు పవన్ ముందడ, మారావార్ కృష్ణ, శ్రీనివాస్, బాబీ సింగ్, పలువురు మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.










చౌట్‌పల్లి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ సంస్కృతిని చాటిన బతుకమ్మ సంబురాలు

నిజామాబాద్, అక్టోబర్ 09 (డిడి9 వార్త):

కమ్మర్ పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి ఎన్. ఆంధ్రయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. విద్యార్థినులతో పాటు పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు కూడా వారితో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎన్. ఆంధ్రయ్య మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే ఈ పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఐక్యతా భావం, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతాయని తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మన సంస్కృతి, వారసత్వ సంపదను భావితరాలకు అందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



పూల పండుగకు పాఠశాలలో పండుగ కళ కృష్ణవేణిలో బతుకమ్మ సంబరాలు

నిజామాబాద్, అక్టోబర్ 09 (డిడి9 వార్త):

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతిబింబమైన బతుకమ్మ వేడుకలు నందిపేట్ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో సందడిగా సాగాయి. సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్ది పాఠశాల ప్రాంగణంలో కొలువుదీర్చారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన విద్యార్థినులు బతుకమ్మ పాటలతో సందడి చేయగా, ఆటపాటలతో ప్రాంగణమంతా ఉత్సాహభరితంగా మారింది. పూల సౌందర్యం, విద్యార్థుల ఆనందోత్సాహాలు వేడుకకు ప్రత్యేక కళను తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ప్రజల జీవన సంస్కృతికి ప్రతిరూపమని పేర్కొన్నారు. పూలకు ప్రాధాన్యమిస్తూ ప్రకృతిని గౌరవించడం, మన సంప్రదాయాలను కాపాడుకోవడం వంటి విలువలను చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు మన ప్రాంతీయ వారసత్వంపై అవగాహన కల్పించడంతో పాటు సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బండి రామాగౌడ్, మాధు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- **టాక్లి గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ పండుగ సంబరాలు అత్యంత వైభవంగా జరిగాయి**

పోతంగల్ అక్టోబర్ 09 (డిడి9 వార్త):

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో టాక్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మగరే పద్మావతి సాయికిరణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాంబ్లే సురేఖ జ్యోతిపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాప్రసాద్, ఉపాధ్యాయులు నరేష్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పిల్లలకు పండుగ ప్రాముఖ్యతను వివరించారు.

విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అమర్చి, వాటి చుట్టూ చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడారు. ఈ సంబరాల్లో పాఠశాల విద్యార్థులు, విద్యార్థినులు, గ్రామ ప్రజలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమం ముగింపులో, హాజరైన ముఖ్య నాయకులు మరియు ఉపాధ్యాయులు పాఠశాల పిల్లలందరికీ రాబోయే దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



కోటగిరి పాలిటెక్నిక్ కళాశాలలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు

కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్
నిజామాబాద్ అక్టోబర్ 09(డిడి9 వార్త):



మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, వాటికి దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిస్తూ నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల యాజమాన్యం మరియు స్థానిక అధికారుల ఆధ్వర్యంలో ఈ సదస్సు విజయవంతంగా జరిగింది.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో కోటగిరి ఎస్సై శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ, నేటి సమాజంలో యువత మరియు విద్యార్థి లోకం డ్రగ్స్ బారిన పడి తమ విలువైన జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలను, చట్టపరమైన ఇబ్బందులను విద్యార్థులకు వివరంగా వివరించారు. చదువుకునే వయసులో విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా, క్రమశిక్షణతో కూడిన ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని సూచించారు.

కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడి ఉంటామని, మాదకద్రవ్యాల నివారణకు కృషి చేస్తామని ఈ సందర్భంగా సామూహిక ప్రతిజ్ఞ (పెంప్రేమలు) చేశారు. అనంతరం విద్యార్థులు డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్ (NSS) వాలంటీర్లు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన సీఐకి జీజీ ఫౌండేషన్ ఆత్మీయ స్వాగతం

నిజామాబాద్, అక్టోబర్ 09 (డిడి9 వార్త):

ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొండి చంద్రశేఖర్ రెడ్డికి జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ నివేదన్ గుజరాతి ఎంఎజేఎఫ్ ఆధ్వర్యంలో సీఐని శాలువా, జ్ఞాపికతో సత్కరించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా నివేదన్ గుజరాతి మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు న్యాయం, భద్రతపై నమ్మకం కలిగించేలా పోలీసులు విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. సామాన్య ప్రజల రక్షణే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేయాలని పేర్కొన్నారు. దీనికి స్పందించిన సీఐ చంద్రశేఖర్ రెడ్డి శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా విధులు నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెండి, బంగారు వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు మంచిర్యాల కిషన్, సంతాని విజయ్, డీజే సునీల్, రాగి నర్సయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీకి ఉచితంగా డెడ్ బాడీ ఫ్రీజర్ విరాళం

సోనాల మండలం: అక్టోబర్ 09 (డిడి 9 వార్త న్యూస్):

సోనాల గ్రామపంచాయతీ ప్రజల అవసరార్థం తులసిరోజ వెంకట్ రెడ్డి జ్ఞాపకార్థం గ్రామానికి విలువైన డెడ్ బాడీ ఫ్రీజర్ (మృత దేహాల భద్రపరిచే యంత్రం)ను శనివారం గ్రామపంచాయతీకి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కుడాల రవీందర్ కుడాల లలిత రవీందర్ నాళం కవిత హనుమాండ్లు ఓస సవిత శ్రీధర్ మాట్లాడుతూ... గ్రామంలో ఎవరైనా మరణించినప్పుడు, బంధువులు దూర ప్రాంతాల నుండి రావడానికి సమయం పడుతుందని, వేసవికాలంలో మృతదేహాలను భద్రపరచడం నిరుపేద కుటుంబాలకు ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించి ఈ ఫ్రీజర్‌ను పంచాయతీకి బహూకరించినట్లు చెప్పారు.

గ్రామ సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి ఉప సర్పంచ్ తుల శ్రీకాంత్, పంచాయతీ నాయకులు ఇర్ల అభిలాష్ భోజరాజు ఓస శ్రీకాంత్ మెడికల్ సూపర్వైజర్ ఉత్తమ్ ఫార్మసిస్ట్ మనోహర్ మరియు వార్డు సభ్యులు దాతల ఉదారతను కొనియాడారు. గ్రామాభివృద్ధికి, ప్రజల సౌకర్యార్థం ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పేర్కొంటూ దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ముందస్తుగా బతుకమ్మ సంబరాలు

సోనాల మండలం: అక్టోబర్ 09:(డిడి 9 వార్త న్యూస్):

వివేకానంద పాఠశాల,సోనాల లో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించడం జరిగింది...ఈ సందర్భంగా సహజ సిద్ధమైన వివిధరకాల పూలతో బతుకమ్మలను పేర్చి పూజా కార్యక్రమాలను నిర్వహించి,కోలాటాలు, నృత్యాలను చేయటం జరిగింది.మహిళా ఉపాధ్యాయులు విద్యార్థులు చాలా ఉత్సాహంగా కోలాటాలు వేశారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పాఠశాల చుట్టుపక్కల ఉన్నటువంటి మహిళలు,విద్యార్థులు పాల్గొన్నారు..



లయోలా పాఠశాలలో కన్నుల పండువగా బతుకమ్మ సంబరాలు

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డిడి9 వార్త):

బోధన్ పట్టణంలోని లయోలా పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా, కన్నులపండువగా నిర్వహించారు. దసరా నవరాత్రుల ప్రారంభ వేళ పాఠశాల విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా ఈ సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సురేష్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ...తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు, జీవన విధానానికి బతుకమ్మ పండుగ నిలువుటద్దమని పేర్కొన్నారు. ప్రకృతిని, పువ్వులను దైవంగా భావించి పూజించే అరుదైన సాంప్రదాయం మన ప్రాంతానికే సొంతమని అన్నారు. ప్రస్తుత ఆధునిక కాలంలో విద్యార్థులకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, మన సాంస్కృతిక మూలాలు, ఆచార వ్యవహారాల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందన్నారు. ప్రతి ఏటా పాఠశాలలో ఇలాంటి వేడుకలు నిర్వహించడం ద్వారా పిల్లల్లో సాంస్కృతిక స్పృహ పెరుగుతుందని ఆకాంక్షించారు. అంతకుముందు విద్యార్థినులు తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలతో రమణీయంగా బతుకమ్మలను తీర్చిదిద్దారు. పాఠశాల ఆవరణలో బతుకమ్మలను ఉంచి, చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉషోదయ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: అక్టోబర్ 09: (డిడి 9 వార్త న్యూస్):

సోనాల మండల కేంద్రంలోని ఉషోదయ పాఠశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకయైన బతుకమ్మ వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు అందరూ ఒకచోట చేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ జానపద పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగల నిర్వహణ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ పండుగలలో బతుకమ్మ పండుగకు విశిష్టమైన స్థానం ఉందని, ప్రకృతిని పూజించే గొప్ప పండుగ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఇర్ల గంగాధర్ , ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



ముల్తానీ సమాజ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

DD9 ఇచ్చోడ మండలంఆదిలాబాద్ జిల్లా

ముల్తానీ సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిమాన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముల్తానీ సమాజ ప్రజలతో కమిటీ సభ్యులు సమావేశమై, వారి సమస్యలు, అవసరాలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ముల్తానీ సమాజ ప్రజలు విద్యా, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం, విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడం, యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించడం వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. సమాజ ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిక అందించడం ఈ కమిటీ ప్రధాన ఉద్దేశంగా ఉంది.ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ త్రిమాన్ కమిటీకి ఇచ్చోడ తహసీల్దార్ చైర్మన్‌గా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కన్వీనర్‌గా, ఇచ్చోడ ఎంపీడీఓ మెంబర్ గా వ్యవహరిస్తున్నారు. కమిటీ ద్వారా ముల్తానీ సమాజ అభ్యున్నతికి అవసరమైన చర్యలు చేపట్టి, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా జిల్లా కలెక్టర్ గారికి పూర్తి సమాచారంతో నివేదిక పంపడం జరుగుతుందని తెలిపినారు ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్లు,మాజీ సర్పంచ్లు, మస్జిద్ కమిటి అధ్యక్షులు,వివిధ గ్రామ పెద్దలు, యువకులు,నాయకులు పాల్గొన్నారు



రైతుల ప్రయోజనాల కోసమే భూముల రీసర్వే : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

బోధన్, నిజామాబాద్ జిల్లా, (డీడీ9 వార్త):

యజమానులు, రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా చూడాలనే సదుద్దేశంతోనే ప్రభుత్వం రీసర్వే చేపడుతోందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. సాలూర మండలం ఫతేపూర్ లో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను శుక్రవారం అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక 'రోవర్' పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున సర్వే పూర్తి చేయాలని, హద్దుల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని ఆదేశించారు. రైతుల సమక్షంలోనే పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, ముందస్తు సమాచారం తప్పనిసరిగా అందించాలని స్పష్టం చేశారు. సాలూర మండలంలో తొలివిడతగా మూడు గ్రామాల్లో ఈ ప్రక్రియ జరుగుతోందని, ఇప్పటికే పోతంగల్, రెంజల్ మండలాల్లో 3 వేల ఎకరాల్లో సర్వే పూర్తయిందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీవో విజయకుమారి, సర్వే శాఖ ఏడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ అజ్మత్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక ఆరోగ్య సేవల బలోపేతానికి పటిష్ఠ చర్యలు

నిజామాబాద్, అక్టోబర్ 09 (డీడీ9 వార్త):

ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందిస్తూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలు అందించాలని అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ పామూరి ఐఏఎస్ అధికారులకు సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో కనీసం 10 శాతం ఇళ్లను సందర్శించాలని, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల విధులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యవేక్షణ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ముందస్తు పర్యటన ప్రణాళికలు, రోజువారీ డైరీలు నిర్వహించాలని, తనిఖీలకు సంబంధించిన సమయ ముద్రతో కూడిన ఫొటోలను సమర్పించాలని సూచించారు. క్షయ, కీటకజనిత వ్యాధులు, జీవనశైలి వ్యాధులు, మాతా శిశు ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఉపకేంద్రాల్లో మందుల నిల్వలను పర్యవేక్షిస్తూ, ఆరోగ్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల సంఖ్యను పెంచేలా వైద్య సేవలను విస్తరించాలని సూచించారు. మారుమూల పీహెచ్‌సీలను ప్రోగ్రామ్ అధికారులు ప్రాధాన్యంగా సందర్శించాలని, ఉద్యోగుల సమయపాలన, ఆసుపత్రుల నమోదు, అత్యవసర వైద్య పరికరాల లభ్యతను పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజశ్రీ, జిల్లా ఉప వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, ఇతర వైద్య సిబ్బంది, బోధన్, నిజామాబాద్ డివిజన్ల పర్యవేక్షణ సిబ్బంది పాల్గొన్నారు.



బడికి గదులు, ఆసుపత్రికి వసతులు కల్పించాలని కలెక్టర్‌కు వినతి

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డీడీ9 వార్త):

సాలూర మండలంలోని ఫతేపూర్ గ్రామంలో భూ రీసర్వే పరిశీలన ముగించుకుని తిరుగు ప్రయాణమైన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి సాలూర మండల కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరత తీవ్రంగా ఉందన, నూతన గదులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు మెరుగుపరిచి, మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.



సాలూరు జెడ్పీహెచ్ఎస్‌లో వైభవంగా బతుకమ్మ సంబరాలు

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డీడీ9 వార్త):

సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది, గౌరమ్మను నిలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థినులు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేస్తూ కోలాటాలు ఆడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజీ మంజుషా, ఉపాధ్యాయులు శోభారాణి, సుధారాణి, విజయలక్ష్మి, జ్యోత్స్న, లక్ష్మి, స్వర్ణ, అంజన, అను, విజయ్ కుమార్, సంగీతారావు, అరుణ్ కుమార్, అబ్బయ్య, స్వామి, రాజ్ కుమార్, విట్టల్ కాంబ్లే, గంధం సాయిలు, మేడి రవి, అక్షయ్ కుమార్ జాదవ్, సునీత, హన్మండ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



బోధన్‌లో ఐక్య కూటమి హోరెత్తిన విజయం

- **ప్రశాంతంగా ముగిసిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు**
- **93.52 శాతం పోలింగ్ నమోదు**

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డీడీ9 వార్త):



బోధన్ ఆర్టీసీ డిపో గుర్తింపు సంఘం ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠభరిత వాతావరణంలో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాగిన పోలింగ్‌లో కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డిపో పరిధిలోని మొత్తం 355 ఓట్లకుగాను 332 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మొత్తం 93.52 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు ముగిసేసరికి ఈయూ, టీఎంయూ, ఎన్ఎంయూల ఐక్య కూటమి ఘనవిజయాన్ని సాధించింది. పోలైన 332 ఓట్లలో ఐక్య కూటమి ఏకంగా 276 ఓట్లను కైవసం చేసుకుని స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇతర ప్రాంతాల నుంచి రావాల్సిన 16 పోస్టల్ బ్యాలెట్ ఓట్లను అక్టోబరు 14, 15 తేదీలలో పరిశీలించి, 17వ తేదీన పూర్తిస్థాయి అధికారిక ఫలితాలను ప్రకటిస్తారని కూటమి నేతలు తెలిపారు. తమపై నమ్మకంతో భారీ మెజారిటీని అందించిన ప్రతీ ఆర్టీసీ కార్మికుడికి, ఉద్యోగికి ఐక్య కూటమి నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి: బోధన్ ఆర్‌డీఓ

బోధన్, నిజామాబాద్, (డీడీ9 వార్త):

రెంజల్ మండల పరిధిలోని సాటాపూర్ గ్రామ శివారులో ఉన్న భూ వివాదాస్పద స్థలాన్ని బోధన్ ఆర్‌డీఓ వి.విజయ కుమారి శుక్రవారం స్వయంగా పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ సమక్షంలో భూమికి సంబంధించిన రికార్డులను, క్షేత్రస్థాయి పరిస్థితులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ... భూసమస్య పరిష్కారానికి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివాదాల నివారణకు రెవెన్యూ అధికారులు సరిహద్దుల సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంజల్ తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



భీమ్ గల్ పట్టణంలో బతుకమ్మ సంబరాలు.. విద్యార్థుల ఆటపాటలతో సందడి

నిజామాబాద్, అక్టోబర్ 09 (డీడీ9 వార్త):

భీమ్ గల్ పట్టణంలోని బోయిగల్లి ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, తల్లులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించగా, విజేతలుగా నిలిచిన వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యారమేష్, ఉపాధ్యాయురాలు జలజ బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లుల భాగస్వామ్యంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.



పూల సోయగాలతో బతుకమ్మ సంబరాలు.. లిటిల్ ఫ్లవర్‌లో పండుగ శోభ

నిజామాబాద్,అక్టోబర్ 09 (డీడీ9 వార్త):

భీమ్ గల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చిన విద్యార్థినులు, ఉపాధ్యాయినులు సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణం పూల సోయగాలతో పండుగ శోభను సంతరించుకుంది.

ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ షఫీ షేక్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, సమాజంలో ఐక్యతను చాటిచెప్పే ఇలాంటి పండుగలు మన ప్రత్యేకతను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు మన సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలియజేయడం అవసరమని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ఐకమత్య భావన పెంపొందుతాయని అన్నారు. మన సంస్కృతిని కాపాడుకుంటూ దాని గొప్పతనాన్ని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గంధపు దత్తుకు సన్మానం

- **ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరం.**

నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 09 (డిడి9 వార్త):



పోతంగల్ ఉమ్మడి మండలాల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా నియమితులైన గంధపు దత్తును ఎమ్మార్పీఎస్ నాయకులు పోచీరం సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గంధపు దత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.
సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రజలకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా తనవంతు కృషి చేయాలని ఆకాంక్షించారు.

పూల సోయగాలతో శ్రీ నారాయణ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

నిజామాబాద్, అక్టోబర్ 09 (డీడీ9 వార్త):

భీమ్‌గల్‌లోని శ్రీ నారాయణ హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతోపాటు వాటిని భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి.



ఇందూరు హైస్కూల్‌లో మిన్నంటిన బతుకమ్మ సంబరాలు

బోధన్, నిజామాబాద్ జిల్లా, (డీడీ9 వార్త):

బోధన్ పట్టణంలోని ఇందూరు హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలు శుక్రవారం కన్నులపండువగా సాగాయి. దసరా సెలవుల నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం ముందస్తుగా ఈ సంబరాలను ప్రాంగణంలో వైభవంగా నిర్వహించింది. విద్యార్థినులు, ఉపాధ్యాయులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ తిరుగుతూ జానపద గేయాలతో ఆడిపాడారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కౌన్సిలర్ వేములపల్లి రామ్మూర్తి లక్ష్మి మాట్లాడుతూ... విద్యార్థులకు బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ కొడాలి కిషోర్ మాట్లాడుతూ..మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన ఈ పండుగను నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఆడపడుచులు ఘనంగా జరుపుకొంటున్నారని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందూరు విద్యాసంస్థల డైరెక్టర్ కొడాలి సాయి విపంచి, హితిష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్టీఐ చట్టంతోనే సుపరిపాలన, పారదర్శకత

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డీడీ9 వార్త):

సమాచార హక్కు చట్టం 2005 పారదర్శకత, జవాబుదారీతనం మరియు సుపరిపాలనకు మూలస్తంభమని నిజామాబాద్ జిల్లా పయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎ. పురుషోత్తం పేర్కొన్నారు. శుక్రవారం నిజామాబాద్‌లో ఎస్‌బిఐ లీడ్ బ్యాంక్ మేనేజర్, స్నేహ ఫౌండేషన్ సంయుక్త సహకారంతో ఆర్‌టిఐ చట్టంపై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పౌరులు తమ హక్కులను తెలుసుకుని సాధికారత సాధించేలా ఈ చట్టం తోడ్పడుతుందన్నారు. కేవలం చదవడం, రాయడం మాత్రమే అక్షరాస్యత కాదని.. చట్టపరమైన అవగాహన, ఆర్థిక అక్షరాస్యత, పౌర బాధ్యతలను తెలుసుకోవడమే నిజమైన విద్య అని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి, దైనందిన జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి అక్షరాస్యత ఎంతో కీలకమని వివరించారు. ఉల్లాస్‌నిల్ప్ కార్యక్రమం ద్వారా జీవితకాల అభ్యాసం, సామాజిక సాధికారతను పెంపొందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకింగ్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.







ఆర్టీఐని పకడ్బందీగా అమలు చేయాలి

- **సమాచారం సకాలంలో అందించాలి**
- **అధికారులకు అదనపు కలెక్టర్ భుజంగరావు ఆదేశం**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డీడీ9 వార్త):

సమాచార హక్కు చట్టం జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు అధికారులను ఆదేశించారు. ఆర్టీఐ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమాన్ని నిజామాబాద్ కలెక్టరేట్ నుంచి ఎల్‌సీడీ తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఆయన ఇతర అధికారులతో కలసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ ప్రాముఖ్యతపై రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఇతర ప్రముఖుల ప్రసంగాలను ఆలకించారు. అనంతరం నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ శాఖల పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు, ఏపీఐఓలతో అదనపు కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. చట్టాన్ని గౌరవిస్తూ పౌరులు కోరిన సమాచారాన్ని సకాలంలో అందిస్తామని, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్టీఐని సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లాకు మంచి గుర్తింపుతో పాటు అవార్డులు తెచ్చేలా పనిచేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సమాచారం అందించడంతో పాటు సంబంధిత రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని, అలసత్వం వహిస్తే అప్పీలేట్ అథారిటీ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి గీత, కలెక్టరేట్ ఏఓ బాలరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నేరాల నియంత్రణకు కఠిన చర్యలు

- **నేరాల నియంత్రణకు కఠిన చర్యలు**
- **గంజాయి, అక్రమ రవాణాపై 'పీడీ యాక్ట్'**
- **దేవీ నవరాత్రులకు పటిష్ట బందోబస్తు**
- **పోలీస్ అధికారుల సమీక్షలో సీపీ సాయిచైతన్య**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డీడీ9 వార్త):

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పనిచేయాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఆదేశించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో శుక్రవారం టౌన్4 పరిధిలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక దాడులు నిర్వహించాలని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని స్పష్టం చేశారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పెండింగ్ కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచడంతో పాటు రాత్రి వేళల్లో తనిఖీలు కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ షీ టీమ్స్, ఈగల్ టీమ్స్ పర్యవేక్షణ పెంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి సైన్ బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిత్యం 'డ్రంక్ అండ్ డ్రైవ్' తనిఖీలు చేపట్టాలని, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం కోసం 'డయల్ 112' పై విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. రాబోయే దేవీ నవరాత్రుల ఉత్సవాల నేపథ్యంలో పట్టణంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాష్, ఏసీపీలు ప్రకాష్ యాదవ్, గురునాయుడు, ఇన్‌స్పెక్టర్లు అంజయ్య, మల్లేశం, సీఐలు, ఎస్ఐఓలు, ఎస్సైలు పాల్గొన్నారు.



రబీలో ఆరుతడి పంటలే సాగు చేయాలి

- **రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి**
- **అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశం**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డీడీ9 వార్త):

జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున రబీ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలే సాగుచేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివిధ జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ (వీబీ జీరాంజీ) పనులకు కూలీలు పెద్ద సంఖ్యలో వస్తున్నందున దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే పనులను చేపట్టాలని సూచించారు. 'తెలంగాణకు జలసిరి'లో భాగంగా పంట కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించి జల సంరక్షణ చేపట్టాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయం, వృథా లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ.. వర్షాభావంతో భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదం ఉన్నందున వరి సాగు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు పరిస్థితులను వివరిస్తూ ఆరుతడి పంటలు వేసేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీఆర్ఓ గీత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగుల పట్ల మానవీయంగా వ్యవహరించాలి

- **వారి సమస్యలను సానుభూతితో అర్థం చేసుకోవాలి**
- **పోలీసులకు సీపీ సాయిచైతన్య సూచన**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డీడీ9 వార్త):

బధిరులు, దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను సున్నితంగా, మానవీయ కోణంలో అర్థం చేసుకుని వారికి అండగా నిలవాలని జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సిబ్బందికి సూచించారు. నిజామాబాద్ టౌన్4 పోలీస్ స్టేషన్ పరిధిలోని 'గ్రేసీ ఆర్గనైజేషన్ ఫర్ డెవలప్‌మెంటల్ సర్వీసెస్' లో బధిర విద్యార్థులతో శుక్రవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. సమాజంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటి పరిష్కారంలో పోలీసుల పాత్రపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బధిరులు తమ సమస్యలను మాటల్లో వ్యక్తపరచలేరని, వారు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు సిబ్బంది సామరస్యంగా, గౌరవంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అవసరమైన చోట సైన్ లాంగ్వేజ్ తెలిసిన వారి సహాయం తీసుకుని, బాధితులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు. పోలీస్ శాఖ అందరికీ సమానంగా సేవలందిస్తుందని, దివ్యాంగుల పట్ల మరింత సానుభూతి, సహనంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు పంపిణీ చేశారు. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి, వారితో ఆత్మీయంగా సమయం గడిపారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎన్. శుభం ప్రకాష్, ఏసీపీలు ప్రకాష్, గురునాయుడు, సీఐలు, ఎస్ఐలు, గ్రేసీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఆర్. శోభారాణి, జనరల్ సెక్రటరీ వై. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎజాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా!!!!

- **డాక్టర్ ఎం.ఏ. హకీమ్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు**

నిజామాబాద్ జిల్లా అక్టోబర్ 9 / (డిడి9 వార్త):

పోతంగల్ మండల కేంద్రంలో జల్ల పల్లి ఫారం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎజాజ్ జన్మదిన వేడుకలను పోతంగల్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, ప్రముఖ సామాజిక సేవకుడు డాక్టర్ ఎం.ఏ. హకీమ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి ఎజాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పుట్టినరోజు ప్రతి ఒక్కరి జీవితంలో ప్రత్యేకమైన రోజని, అలాంటి రోజును కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల మధ్య ఆనందంగా జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. ఎజాజ్ ప్రజలకు మరింత సేవ చేస్తూ, ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు, ఇతర ప్రముఖులు పాల్గొని ఎజాజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



రైతులు, ప్రజలకు ఇబ్బంది కలగొద్దు

- **కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు**
- **రైస్ మిల్లర్లతో సమీక్షలో సీపీ సాయిచైతన్య హెచ్చరిక**

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 09(డీడీ9 వార్త):

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, విక్రయాల ప్రక్రియలో రైతులు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య సూచించారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రైస్ మిల్స్ అసోసియేషన్ల ప్రతినిధులు, మిల్లర్లతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో తలెత్తిన మార్పులు పంటల సాగు, దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపించే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని అధిక ధరలకు ఇతర ప్రాంతాలకు తరలించడం, నిల్వలు నొక్కిపట్టి కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్ణీత ధరల మార్గదర్శకాలకు అనుగుణంగానే కొనుగోళ్లు, అమ్మకాలు సాగాలన్నారు. సామాన్యులపై అదనపు భారం పడకుండా సరసమైన ధరలకే బియ్యం అందుబాటులో ఉంచేలా మిల్లర్లు సహకరించాలని కోరారు. ధాన్యం రవాణా, నిల్వల విషయంలో సంబంధిత శాఖల నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అందరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు డీసీపీ ఎన్. శుభం ప్రకాష్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం. శ్రీకాంత్ రెడ్డి, డీఎం ప్రవీణ్, ఏసీపీ ప్రకాష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశం, రైస్ మిల్స్ అసోసియేషన్ కార్యదర్శి మోహన్ రెడ్డి, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, మిల్లర్లు పాల్గొన్నారు.





అదనపు కలెక్టర్‌గా రాజాగౌడ్ బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ జిల్లా, (డీడీ9 వార్త):

నిజామాబాద్ జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పి.రాజాగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇప్పటివరకు అదనపు కలెక్టర్‌గా పనిచేసిన ఎస్.కిరణ్ కుమార్ పదవీ విరమణ చేయడంతో, జగిత్యాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న రాజాగౌడ్‌ను నిజామాబాద్ జిల్లాకు



మెట్‌పల్లి మున్సిపాలిటీ 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా తుమ్మనపెల్లి రాంప్రసాద్ నియామకం

- **జువ్వాడి నర్సింగరావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించిన తుమ్మనపెల్లి రాంప్రసాద్**
- **కాంగ్రెస్ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: తుమ్మనపెల్లి రాంప్రసాద్**

డిడి9 వార్త మెట్ పల్లి:

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపాలిటీ 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా తుమ్మనపల్లి రాంప్రసాద్ నియమితులయ్యారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది.
ఈ సందర్భంగా తుమ్మనపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించిన జువ్వాడి నర్సింగరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.
25వ వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని రాంప్రసాద్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ రాంప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. రాంప్రసాద్‌కు బెజ్జారపు సత్యనారాయణ, తునికి రాము, బెజ్జారపు నాగరాజు, బొక్కునపెల్లి శ్రీధర్ తదితరులు ప్రత్యేక హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.